సాక్షి వికారాబాద్

మంగళవారం । 4 । జూన్ । 2024



వేధిస్తే ఊరుకోం

బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోమని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. 8లో▸



సదస్సును సక్సెస్ చేయాలి

'ఉపాధి' చట్టంపై నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. 8లో▸



సాగుకు సన్నద్ధం

వానాకాలం సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. 9లో▸

సర్వత్రా ఉత్కంఠ

నేడు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

- గెలుపుపై అభ్యర్థుల ధీమా
- జోరుగా బెట్టింగులు
- ఏపీ ఫలితాలపైనా చర్చ



చేవెళ్ల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి, ఎన్నికల అబ్జర్వర్

వికారాబాద్: ఇరవై రోజులుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చింది.. ఎక్కడ చూసినా.. ఎవరిని కదిపినా.. ఎన్నికల ఫలితాలపైనే చర్చ జరుగుతోంది. అభ్యర్థులు, నాయకులు, ప్రజల్లో టెన్షన్ నెలకొంది. ఇన్నాళ్లు వారాలు.. రోజు లు లెక్కబెట్టిన పార్టీలు, ప్రజలు, ప్రజా ప్రతి నిధులు, నేతలు ఇప్పుడు గంటలు లెక్కిస్తున్నారు. గత నెల 13న పోలింగ్ జరగ్గా నేడు ఫలితాలు వెలువడనున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, నేతలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు జిల్లాకు చెందిన శాసన సభ్యుల్లో టెన్షన్ మొదలయ్యింది. కమలం పార్టీ పుంజుకుందన్న ప్రచార నేపథ్యంలో అధికార కాంగ్రెస్ నేతల్లో ఆందోళన కనిపిస్తోంది. పోలింగ్‌కు ముందే బీఆర్ఎస్ నేతలు చేతులెత్తేయడం కాంగ్రెస్‌కు మరింత సంకట పరి స్థితి తెచ్చిపెట్టింది. జిల్లాకు చెందిన వ్యక్తులే సీఎంగా, స్పీకర్‌గా ఉన్నారు. మిగతా రెండు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. దీంతో వారిలో టెన్షన్ మొదలైంది.

ఊపందుకున్న బెట్టింగ్

ఇటీవలి వరకు ఐపీఎల్ బెట్టింగ్‌లకు దిగిన వారు.. నేడు వెలువడే లోక్‌సభ ఫలితాలపై పందెం కాస్తున్నారు. ఐపీఎల్ బెట్టింగ్‌లో ఎక్కు వ శాతం యువతే పాల్గొనగా ఇందులో యువతతో పాటు రాజకీయ నాయకులు, సాధారణ ప్రజలు సైతం పందెం పెడుతున్నారు. ప్రధానంగా దేశ రాజకీయాలు చర్చిస్తూనే రాష్ట్రంలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి..? చేవెళ్ల బాద్‌షా ఎవరు ? అంటూ బెట్ కడుతున్నారు. మరీ ముఖ్యం గా ఏపీ రాజకీయాలపై కూడా ఎక్కువ చర్చ జరుగుతోంది. ఆంధ్రాలో అధికారం ఎవరిని వరిస్తుంది.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి అనే విషయంపై పందెం కాస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరికి.. ఏ పార్టీకి మెజార్టీ వస్తుంది..? ఏ మండలంలోఏ పార్టీకి లీడ్ వస్తుంది..? అని చర్చ జరుగుతోంది. దీంతో పాటు తమతమ గ్రామాల్లో ఎవరికి ఎంత లీడ్ వస్తుందనే విషయంలోనూ అంచనాలు వేస్తూ బెట్టింగులకు దిగుతున్నారు. రాష్ట్ర విషయానికి వస్తే.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏ మేరకు ఓట్లు చీలుస్తుందనే దానిపైనే కాంగ్రెస్ గెలుపోటములు ఆధారపడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పైకి ధీమా.. లోపల గుబులు

జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి వికారాబాద్, పరిగి, తాండూరు వస్తాయి. కొడంగల్ పాలమూరు పరిధిలోకి వెళుతుంది. మంగళవారం వెలువడే ఫలితాలు ఎలా ఉంటాయి అనే దానిపై అభ్యర్థులు ఎవరికి వారు లెక్కలు వేసుకొని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. తామే గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ సంవత్సరం ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగిన విషయం తెలిసిందే. కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం బాగా పెరిగింది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభిస్తుందోననే కోణంలో కూడా అంచనా వేస్తున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం 60.49 శాతం నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో జిల్లాలో 69.07 శాతంగా నమోదైంది. ఏకంగా తొమ్మిది శాతం ఓటింగ్ పెరిగింది. అభ్యర్థులు ఓ వైపు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూనే లోలోన గుబులు చెందుతున్నట్లు సమాచారం. ఎగ్జిట్‌పోల్స్‌పై కూడా చర్చించినట్లు తెలిసింది. జిల్లాలోని పలు సెగ్మెంట్లలో కొందరు అభ్యర్థులకు తమ పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారానికి, ఇతర వ్యక్తులు, మార్గాల ద్వారా తెలుసుకుంటున్న సరళికి పొంతన కుదరకపోవడంతో ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కొడంగల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు వర్సిటీ గ్రంథాలయం బ్లాక్‌లో ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 14 టేబుళ్లు, 21 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ కోసం 300 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారని ఏఆర్ఓ తెలిపారు.

'బీడీ లీఫ్' బోనస్ పక్కదారిపై విచారణ

- రంగంలోకి రాష్ట్ర విజిలెన్స్ అధికారులు
- అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- చర్యలు తీసుకుంటామని వెల్లడి

ధారూరు/అనంతగిరి: బీడీ లీఫ్ బోనస్ డబ్బులు పక్కదారి పట్టడంపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ చేపట్టారు. శనివారం ధారూరుకు చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ సభ్యుడు నరేష్.. బీడీ ఆకులు సేకరించిన కూలీలకు చెందాల్సిన బోనస్ డబ్బులు పక్కదారి పట్టాయని సీఎం రేవంత్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండాసురేఖ, సీసీఎఫ్ తదితరులకు ట్విట్టర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర విజిలెన్స్ బృందం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో తనిఖీలు చేసింది.

ప్రాసెస్ ఇలా..

అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు బీడీ ఆకులు సేకరించడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. సేకరించి ఆకులను


మాట్లాడుతున్న రాజశేఖర్

కూలీలు ప్రభుత్వం నుంచి టెండర్ పొందిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకుగాను సదరు వ్యక్తి కూలి చెల్లిస్తాడు. బీడీ ఆకులను కాంట్రాక్టర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి డబ్బు పొందుతాడు. దీంతో ఈ వ్యవహారం ముగుస్తుంది. అనంతరం ప్రభుత్వం బీడీ ఆకులను విక్రయించిన సమయంలో వచ్చే నికర లాభాన్ని కూలీలకు బోనస్ రూపంలో ఇస్తుంది.

సమగ్ర విచారణ జరుపుతున్నాం

శనివారం సాక్షి దినపత్రికలో బీడీ లీఫ్ బోనస్ డబ్బుల పక్కదారిపై వార్త వచ్చింది.. దీని ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు రాష్ట్ర విజిలెన్స్ అధికారి రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి ఏటా ప్రభుత్వం బీడీ ఆకులు విక్రయించగా వచ్చిన నికర లాభాన్ని కూలీలకు బోనస్ రూపంలో ఇస్తుంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లకు సంబంధించిన డబ్బులు ఈ ఏడాది మంజూరయ్యాయి. జిల్లాకు దాదాపు రూ. 60 లక్షలు బోనస్ రూపంలో డబ్బు వచ్చాయి. ఇందులో గొట్టిముకుల యూనిట్ రూ.7.50 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదన్న విషయం తమ విచారణలో తేలింది. అటవీ శాఖ కార్యాలయంలో పని చేసి చనిపోయిన డ్రైవర్, అతని భార్య ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తేలింది. ఇందులో ఎవరి ప్రమేయం ఉందనే దానిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. డబ్బు కాజేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ధారూరు, కుల్కచర్ల, వికారాబాద్ మండలా యూనిట్ల తోపాటు జిల్లా అంతటా విచారణ చేయిస్తాం. బోనస్ డబ్బు ఏ మేరకు స్వాహా చేశారో విచారణలో తేలుస్తాం. ఇందులో ఏ స్థాయి అధికారి ఉన్నా వదిలిపెట్టేది లేదని రాజశేఖర్ స్పష్టం చేశారు.

కాజేసింది ఇలా..

గొట్టిముకుల అటవీ ప్రాంతం పరిధిలోకి మండలంలోని తరిగోపుల గ్రామం వస్తుంది. 2017లో ఇక్కడి కూలీలు బీడీ ఆకులు సేకరించారు. 2023లో ప్రభుత్వం ఇందుకు సంబంధించిన బోనస్ డబ్బులు రూ.7.50 లక్షలను విడుదల చేసింది. ఆ సమయంలో అటవీ శాఖ కార్యాలయంలో పని చేసిన ఓ అధికారి కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా కూలీలకు చెందాల్సిన డబ్బులను కార్యాలయంలో పనిచేసే డ్రైవర్, అతని భార్య బ్యాంక్ ఖాతాల్లో రూ. 3.75 లక్షల చొప్పున జమ చేసి కాజేసినట్లు తెలిసింది.

పాలిసెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు


చైత్రారెడ్డి


కె.అజయ్


పట్లోళ్ల ఆశ్రిత


పట్లోళ్ల హార్దిక్‌రెడ్డి

అనంతగిరి: పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పాలిసెట్ జిల్లా కన్వీనర్ పరమేశ్వర్ అన్నారు. జిల్లాకు చెందిన చైత్రారెడ్డి ఎంబైపీసీ విభాగంలో 116వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో 173వ ర్యాంకు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జిల్లా ద్వితీయ స్థానం సాధించిన కె.అజయ్ ఎంబైపీసీ విభాగంలో 159, ఎంపీసీ విభాగంలో 183వ ర్యాంకు సాధించాడు. పట్లోళ్ల ఆశ్రిత ఎంబైపీసీలో 232వ ర్యాంకుతో, ఎంపీసీ విభాగంలో పట్లోళ్ల హార్దిక్‌రెడ్డి 429వ ర్యాంకుతో జిల్లా మూడో టాపర్‌గా నిలిచారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి

స్పీకర్‌ను కోరిన గ్రంథాల సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్య

దోమ: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను జిల్లా గ్రంథాల సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం విషయంపై స్పీకర్‌తో చర్చించి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.


స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదయ్యగౌడ్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పరిగి సివిల్ కోర్టు జడ్జి శిల్ప

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పరిగి సివిల్ కోర్టు న్యాయమూర్తి శిల్ప అన్నారు. సోమవారం ఆమె పాంబండ రామలింగేశ్వర స్వామిని తన కుటుంబీకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పాండుశర్మ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న శిల్ప

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ

కుల్కచర్ల: నూతన విద్యాసం వత్సరం ప్రారంభానికి సమయం దగ్గరపడడంతో కుల్కచర్ల మండల పరిధిలోని 69 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ చేరాయి. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్ అహ్మద్ మాట్లాడుతూ.. 5,318 విద్యార్థులకు 24వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయని చెప్పారు. 6వ తరగతి నుంచి 10వరకు విద్యార్థుల సౌకర్యార్థం 28వేల నోట్‌బుక్స్ ఉన్నాయన్ని వివరించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి అన్ని పాఠశాలలో విద్యార్థులకు సరిపడ పాఠ్యపుస్తాలు, నోట్ బుక్స్ అందుబాటులో ఉంచుతామన్నా రు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రమేశ్, సీఆర్పీలు గాంగ్యానాయక్, కృష్ణ, రమేశ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


క్లస్టర్ల వారీగా పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ అబీబ్ అహ్మద్

బైక్‌ను ఢీకొట్టిన పోలీస్ వాహనం

సుమో టైర్ పేలడంతో ప్రమాదం

పూడూరు: పోలీస్ వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం వికారాబాద్ నుంచి మన్నెగూడ వైపు ప్రయాణిస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్ వద్దకు రాగానే టైర్ పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వికారాబాద్ మండలం మొరంగపల్లికి చెందిన మహ్మద్ మౌలానా భార్య రేష్మాబేగం తీవ్రంగా గాయపడ్డారు. వారి చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో గాయపడిన దంపతులు

కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- హామీలు అమలు చేయాలని డిమాండ్

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్‌ను మించిన పరిపాలనాదక్షుడు మరెవరూ లేరన్నారు. సంపదను పెంచి ప్రజలకు పంచడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 46 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. గిరిజనలకు పది శాతం రిజర్వేషన్ కల్పించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ముందుకు తీసుకెళితే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేదిలేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి వేధిస్తున్నట్లు తెలిపారు. కక్షపూరిత చర్యలు మానుకోకపోతే ధర్నాలు రస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, యాదగిరి, సలీం, భీములు తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

రోగులకు పండ్లు పంపిణీ

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణదాతలు కావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయన సోమవారం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది రోగుల పట్ల స్నేహభావం చూపుతూ చికిత్స నిర్వహించాలని సూచించారు.

కేటీఆర్‌తో మాట్లాడి సాయం అందిస్తా

బొంరాస్‌పేట: ఇటీవల మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు వెంకటయ్య కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి భార్యా, కూతుళ్లను మాట్లాడారు. వెంకటయ్య చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కేటీఆర్‌తో మాట్లాడి సాయం అందేలా చూస్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, దుద్యాల మండల యూత్ అధ్యక్షుడు బోగమోని సురేశ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం మెట్లకుంటలో పార్టీ నాయకుడు ఇస్నత్‌పల్లి రామయ్య మృతిచెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యారు.

స్కేటింగ్‌లో సత్తాచాటిన రుద్రాంశ్



పెద్దేముల్: మండల పరిధిలోని ఆత్కూర్‌కు చెందిన బాలుడు రుద్రాంశ్‌చారి స్కేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడు. గ్రామానికి చెందిన విక్రమాచారి కుమారుడు రుద్రాంశ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా ముత్తుకూర్ బీవీఆర్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఉద్యోగరీత్యా నెల్లూరులో ఉంటున్న విక్రమాచారి తన కుమారుడికి స్కేటింగ్ కోచ్ శరత్‌కుమార్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నాడు. శివగంగ రోలర్ స్కేటింగ్ క్లబ్ వారు మే 26 నుంచి 31 వరకు బెల్గాంలో.. అటెమ్ట్ ఫర్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పేరున 75 గంటల స్కేటింగ్ నిర్వహించారు. ఈ పోటీల్లో 360 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 106 మంది ఉత్తమ ప్రతిభ కనబరచగా రుద్రాంశ్ మొదటివరుసలో నిలిచాడు.

వీధి కుక్క దాడి

తుర్కయంజాల్: వీధి కుక్క దాడిలో తల్లీకుమారులు తీవ్రంగా గాయపడ్డారు. తనయుడిని కరిచిన పది రోజుల్లోనే అదే కుక్క సోమవారం తల్లి సుగుణమ్మపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విజయం ఎవరిదో!

- ఎంపీ అభ్యర్థుల జయాపజయాలపై ఉత్కంఠ
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

తాండూరు: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని తాండూరు, వికారాబాద్, పరిగి అసెంబ్లీ స్థానాలు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటాయనే విషయమై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడం, వీరిలో ఒకరు ముఖ్యమంత్రి(రేవంత్‌రెడ్డి)గా, మరొకరు స్పీకర్ (ప్రసాద్‌కుమార్)గా కొనసాగుతుండంతో ఆ పార్టీలో భారీ అంచనాలు ఉన్నాయి. హిందుత్వ నినాదం, మోదీ చరిష్మాతో ఎన్నికల్లోకి వెళ్లిన బీజేపీ సైతం విజయంపై ధీమాగా కనిపిస్తోంది. దీంతో గెలుపుపై ఆ పార్టీ శ్రేణుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు, ఫలితాలపై ప్రతి ఒక్కరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.



మల్కాజిగిరిలో 'పట్నం' మార్కు?

మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తొలిసారి పార్లమెంట్ ఎన్నికల్లో తలపడుతున్నారు. రెండు పర్యాయాలు రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసి, ప్రస్తుతం వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా, ఓటమి ఎరగని నాయకురాలిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ నుంచి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించినా.. రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఆమెకు మల్కాజిగిరి నుంచి అవకాశం లభించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆమె విజయంపై టెన్షన్ నెలకొంది.

'ఉపాధి' సదస్సును సక్సెస్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య

పరిగి: ఉపాధి హామీ పథకం చట్టం అమలు - సవాళ్లు అనే అంశంపై నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య పలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో జిల్లాలోని ఉపాధి కూలీలు, కార్మిక సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, ప్రభు, మాణిక్యం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఆలయంలో హుండీ చోరీ

మొయినాబాద్: వరుస చోరీలు స్థానికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. గుడిలో హుండీలకే రక్షణ లేకుండా పోయింది. దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో హుండీని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బయటకు తీసుకెళ్లారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల వీధిలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయంలో హుండీ లేదని గమనించిన గ్రామస్తులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. పాఠశాల పక్కన హుండీ పడి ఉంది. అక్కడే కొన్ని చిల్లర నాణేలు పడి ఉన్నాయి. నోట్లు ఎత్తుకెళ్లిన దుండగులు చిల్లరను అక్కడే వదిలేశారు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరవై రోజుల్లోనే నాలుగు ఘటనలు

మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. నెల రోజుల్లోనే నాలుగు చోరీలు జరిగాయి. 20 రోజుల క్రితం మండల కేంద్రంలో పార్కు చేసిన బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. పది రోజుల క్రితం సిద్దార్థ కళాశాల భవనంలో ఇద్దరు మహిళలు ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. మూడు రోజుల క్రితం సురంగల్ సమీపంలోని కట్టమైసమ్మ ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి నాగిరెడ్డిగూడలోని హనుమాన్ ఆలయంలో హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. రెండు దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయడం లేదు. పోలీసుల నిఘా లేకనే దొంగలు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు.

రూ.5లక్షల నగదు అపహరణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మంచాల రోడ్డులో కిరాణా దుకాణంలో దొంగలు పడి రూ.5లక్షల నగదు, తులం బంగారం చోరీకి గురయ్యాయి. జి.నాగేష్, భార్య పద్మావతి.. ఇద్దరూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న హైదరాబాద్ వెళ్లి.. ఆదివారం తిరిగి వచ్చారు. ఇంటికి తిరిగి వచ్చే సరికి.. తలుపు గడియ విరగగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. రూ.5లక్షల నగదు, తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్-చిట్టిగిద్ద రైల్వే స్టేషన్ మధ్య చించల్‌పేట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన ప్రకారం.. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడి వయసు 20 సంవత్సరాలపై ఉంటుందని, ఒంటిపై రెడ్ బాడర్ ఉన్న బ్లాక్ బనియన్ ఉందని, షర్ట్ లైట్ బ్లూకలర్ నిలువు లైన్‌లతో షర్ట్ ఉందని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. శవాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. సంబంధీకులు ఉంటే 8712658587 నంబర్‌లో సంప్రదించాల్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

